# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  29-03-2025                    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉగాది పండుగను పురస్కరించుకుని రేపు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానాన్ని ప్రారంభించనుంది.
- అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర పట్టు వస్త్రాలు సమర్పించారు.
- యువత  మత్తు పదార్థాలకు బానిస కాకుండా చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ  "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది.

======================

ఉగాది పండగను పురస్కరించుకుని రేపు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానాన్ని ప్రారంభించనుంది. సచివాలయం చేరువలో సభావేధిక ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇదే వేదిక నుండి పి-4 విధానాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా అధికారులతో  ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్  ఈరోజు దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. కార్యక్రమం ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

======================

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.72 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఈరోజు తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 4 వేల 853 చెరువులలో పూడికతీత, పునరుద్ధరణ పనులు చేపట్టి 124 కోట్ల రూపాయలను కూలీలకు చెల్లించామని చెప్పారు. అదేవిధంగా ఎస్సి, ఎస్టి, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో 1,064 పంటకుంటలు నిర్మించి 6 కోట్ల రూపాయల వేతనాలను చెల్లించామన్నారు. 100 కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలతో రానున్న మూడు నెలల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ వెల్లడించారు.

======================

యువత  మత్తు పదార్థాలకు బానిస కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ లో జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్ రావుతో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి నార్కోటిక్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేపటి సమాజం నేటి యువతపై ఆధారపడి ఉందని, అటువంటి యువత మత్తు పదార్థాలు వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకుంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాల విక్రయంపై గట్టి నిఘా ఉంచామని, వీటిని నివారించే దిశగా కృషి చేస్తున్నామన్నారు.  జిల్లాలో డ్రగ్ ఇన్స్పెక్టర్ల సహాయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

======================

వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని, వీటిని వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. దామోదరరావు పేర్కొన్నారు. ఈరోజు జిల్లా కోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా  మాట్లాడుతూ.. కక్షిదారుడు లోక్ అదాలత్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి రుసుము చెల్లించకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చని.. ఇరుపక్షాలకు అంగీకారమైన తీర్పు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కక్షిదారులు రాజీ షరతులకు అంగీకరించకుంటే న్యాయస్థానాల విధానంలోనే తీర్పు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమమని, దీనిపై అపీల్ చేసుకునే అవకాశం ఉండదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్లు చేయవలసిన విధివిధానాలను ఆయన వివరించారు.

======================

జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్ కు విశాఖపట్నం నోడల్ ఏజెన్సీ నుండి ముగ్గురు విద్యార్థినిలు ఎంపికయ్యారని నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి జి. మహేశ్వర రావు తెలియజేశారు. విశాఖ నోడల్ ఏజెన్సీ పరిధిలో ఎంపికైన జ్యోత్స్న, లాస్య, శివానీలు వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి యువ పార్లమెంట్ లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిన్న నిర్వహించిన  రాష్ట్ర స్థాయి పోటీలలో 90 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం ముగ్గురు మాత్రమే జాతీయ స్థాయి పోటీలకు అవకాశం సాధించారన్నారు.

======================

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారుల కల నెరవేరుతోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లకు మంత్రి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో 97.90 కోట్ల రూపాయలతో 682 కి.మీ మేర రహదారులకు గుంతలు పూడ్చే కార్యక్రమన్ని చేపట్టి పలు రోడ్లను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు.

విరామం

======================

బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలలో సభ్యుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యవేక్షణ అధికారి వై.చంద్ర శేఖర్  ఒక ప్రకటనలో తెలిపారు. బాలల న్యాయ మండలి సభ్యుల నియామకానికి సంబంధించిన పూర్తి సమాచారం, అర్హతల వివరాలు, దరఖాస్తుఫారంను wdcw.ap.gov.in  వెబ్ సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వెబ్ సైట్ నుండి అప్లికేషన్ డౌన్

లోడ్ చేసుకొని ఏప్రిల్ 9వ తేదీ లోగా విజయవాడలోని డైరెక్టరు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖకు పంపాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా పర్యవేక్షణ అధికారిని 90301 53369 నంబరులో సంపదించాలన్నారు.

======================

అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా ఈరోజు గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. శ్రీ నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తరువాత తొలిసారిగా అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించామన్నారు. సుమారు పది కోట్ల రూపాయలు నిధులతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది అమ్మవారిని దర్శిస్తారని చెప్పారు. అనకాపల్లి పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

======================

సంక్షేమానికి నాంది పలికిన ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆదర్శం కోసం పుట్టిన పార్టీ అని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు ఢిల్లీలో ఈరోజు ఘనంగా జరిగాయి. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో జరిగిన ఈ వేడుకలకు టీడీపీ ఎంపీలు హాజరయ్యారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఎలాంటి కష్టాలు వచ్చినా టీడీపీ ఎదుర్కొని నిలబడి.. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

======================

ఉపరితల ద్రోణి అంతర్గత ఒడిశా ప్రాంతం నుండి కొమోరిన్ వరకు మధ్య ఛత్తీస్‌గఢ్, అంతర్గత మహారాష్ట్ర, అంతర్గత కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల మీదుగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు తెలిపారు. దీంతో రేపు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================
======================